క్లుప్తంగా

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



మహిళకు చీర అందిస్తున్న అతిథులు

కంచరపాలెం: ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ఆధ్వర్యంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో బౌద్ధ బిక్షువు బాంతేజీ ప్రత్యేక పూజలు చేశారు. 55వ వార్డు కార్పొరేటర్ శశికళ మాట్లాడుతూ సమాజంలో బుద్ధుడికి గౌరవమైన స్థానం ఉందన్నారు. సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఆమె చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు, వృద్ధులకు ఆహారం పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్, భీమరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ కమిటీ ప్రతినిధులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 3 వందల మందికి అన్నదానం చేశారు. మల్కాపురం గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు భోగవల్లి నాగభూషణం, ఉరుకూటి బాబూరావుయాదవ్, సత్యాల మహేష్ తదితరులు పాల్గొని నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

బాక్సింగ్‌లో సత్తా చాటుతున్న రేష్మాయాదవ్



బంగారు పతాకం చూపుతున్న రేష్మాయాదవ్

మల్కాపురం : యాదవవీధికి చెందిన వాకాడ రేష్మా యాదవ్ ఇటీవల మహారాష్ట్ర, పూణేల్లో జరిగిన జాతీయ స్థాయి ఎల్‌బో బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌-2023లో బంగారు పతకం సాధించింది. మహిళా విభాగానికి సంబంధించి 55 నుండి 60 కేజీల వెయిట్‌లో జరిగిన ఈ పోటీలో ఆమె వివిధ రాష్ట్రాల మహిళా బాక్సర్లతో తలపడి పతకం దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఆమె శుక్రవారం స్వగృహానికి చేరుకుంది. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు బాక్సర్లు, కోచ్‌లు రేష్మాయాదవ్‌ను కలిసి అభినందించారు. చిన్న వయసులోనే ఆమె నగరంతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన బాలికలు, మహిళల విభాగంలో రాణించి సిల్వర్, బ్రాంజ్, గోల్డు మెడళ్లు సాధించింది.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని శారద

సీతంపేట: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. వీరగంట లలితా చంద్రశేఖర్ శిష్యురాలు కొంపెల్ల లక్ష్మి శారద తన అద్భుత గాత్రంతో ప్రేక్షకులను అలరించారు. నీవే నన్ను, శ్రీవిఘ్న రాజం భజే, గౌరీ సుకుమారి, శ్రీకమలాంబికే, పామర జానపాలిని, మంగళదాయిని వంటి ముత్తుస్వామి దీక్షితార్, బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన పలు గీతాలను పాడి భక్తులను ఆకట్టుకున్నారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని శారదను సత్కరించి అభినందించారు.

శిథిలావస్థలో మంచినీటి పథకం

- విరిగిన మెట్ల మార్గం
- ఊడుతున్న కోలమ్స్ పెచ్చులు
- మొరాయిస్తున్న మోటారు పంపులు
- పొంచి ఉన్న పెనుప్రమాదం



కోలమ్స్ పెచ్చులు ఊడి, కనిపిస్తున్న ఇనుప రాడ్లు



పాత చెక్‌పోస్టు ఏరియా వద్ద మంచినీటి పథకం



విరిగిన మెట్ల మార్గం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత వాసుల దాహార్తి తీర్చుతున్న భారీ మంచినీటి పథకం (వాటర్ ట్యాంక్) పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీని కోలమ్స్ పెచ్చులు ఊడాయి. మెట్లు విరిగి, బీటలు వారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు కలవరపడుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలోని 58 నుంచి 63 వార్డుల ప్రజల నీటి అవసరాల కోసం 59వ వార్డు పరిధి పాతచెక్‌పోస్టు ఏరియా వద్ద 1978లో లక్షల వ్యయంతో సుమారు 800 కేఎల్ నీటిని స్టోర్ చేసే సామర్థ్యంతో భారీ మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. మిందీ వద్ద గల రిజర్వాయర్ నుంచి భూగర్భ మార్గాన ఇక్కడి వాటర్ ట్యాంక్‌కు నిత్యం నీటిని పంప్ చేస్తుంటారు. ఇక్కడి నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో గల మినీ మంచినీటి పథకాలకు నీటిని పంప్ చేస్తుంటారు. అయితే పాతచెక్‌పోస్టు వద్ద గల భారీ మంచినీటి పథకం నిర్మించి 45 ఏళ్లు కావటంతో, శిథిలస్థితికి చేరుకుంది. ట్యాంక్ దిగువ గల కోలమ్స్ పెచ్చులు ఊడి, ఇనప రాడ్‌లు కనిపించే విధంగా ఉన్నాయి. ట్యాంక్ లోపలి భాగం శుభ్రపరిచేందుకు వెళ్లే మెట్ల మార్గం విరిగిపోయింది. దీంతో ట్యాంక్ పైకి వెళ్లాలంటే ఇక్కడి సిబ్బంది సాహస యాత్ర చేసినట్లుగా ఉంటోంది. అలాగే ట్యాంక్ చుట్టుకొలత భాగంలోనూ పలు చోట్ల బీటలు వారాయి. వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించినప్పుడు బిగించిన మోటారు పంపులనే ఇప్పటికీ వినియోగిస్తుడటంతో అవి మొరాయిస్తున్నాయి. ఇక్కడి రిజర్వాయర్ పరిస్థితిని చూసి స్థానికులు హడలిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు తెలియజేసినా..

ఇక్కడి వాటర్ ట్యాంక్ పరిస్థితిని స్థానికులు, అధికారులు ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. మరమ్మతులకు సంబంధించి అంచనా రూపొందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పాత మోటార్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

సీఎం జగన్ పంపారు

- సమస్యలేమిటో చెప్పండి
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్



ఇందిరానగర్‌లో స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పంపారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ 92 వార్డు ఇందిరానగర్‌లో ఉదయం, సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రభుత్వం ద్వారా ఏ విధమైన లబ్ధి పొందారో వివరించారు. మనకు లబ్ధి చేకూరాలంటే సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని అభ్యర్థించారు. సుమారు 600 పైచిలుకు ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులను కలిశారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడా గుర్తించాలని అన్నారు. హామీలిచ్చి మరిచిన ప్రభుత్వం తెలుగుదేశమైతే, 98 శాతం హామీలు నెరవేర్చిన ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, ఊటపల్లి గోవిందు, కన్వినర్లు త్రినాథ్, అనురాధ, కిషోర్, రామకృష్ణ, గొంతిన నాగరాజు, బి. గోపి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు



సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ చల్లా రజని

కంచరపాలెం: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ నేతృత్వంలో కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, ముత్తయిదువుల చేతుల మీదుగా ఊంజల సేవ చేశారు. స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం జరిపారు. 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కాండ్రేగుల రాము, సిహెచ్.కుమారి, కె.రవి, సిహెచ్.సురేష్ శర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పర్యటన



దస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారుడికి సూచిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

కంచరపాలెం: బహిరంగ ప్రదేశాలు, రహదారుల వెంబడి చెత్తాచెదారం, చెట్ల కొమ్మలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. 54వ వార్డు 104 ఏరియా, కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వాకింగ్ ట్రాక్ ప్రాంతాల్లో వాకర్స్‌తోమాట్లాడారు. రాగిజావ విక్రయిస్తున్న ఓ వ్యాపారి ప్లాస్టిక్ గ్లాసులు వాడటం, రోడ్లపై అవి పడి ఉండటం చూసి మండిపడ్డారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకూడదని, డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారులకు సూచించారు. అనంతరం త్రీస్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులపై కమిషనర్ ఆగ్రహించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో శానిటరీ సిబ్బందిని నియమించి ప్రతి రోజు ఉదయం రోడ్లను శుభ్రం చేయించాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోన్-5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో వేసవిలో ఉపశమనం

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



40వ వార్డులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : మండే వేసవిలో చలివేంద్రాలు చక్కటి ఉపశమనం అందిస్తాయని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. పారిశ్రామిక పాంతంలోని 59, 60, 61 వార్డుల పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. దీనిలో భాగంగా 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని, 60వ వార్డు గుల్లలపాలెం వద్ద, 61వ వార్డు ఆర్‌కేపురం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల వద్ద ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి ముఖ్యమైన కూడళ్లలో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రాలను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలన్నారు. ప్రతిరోజు ఆయా కేంద్రాలకు అవసరమైన మజ్జిగ పంపిణీకి అవసరమైన పెరుగు తన సొంత నిధులతో అందజేసేందుకు సిద్ధమన్నారు. ఆయా కేంద్రాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, 59వ వార్డు పార్టీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు చైర్మన్ ఆల్ఫా కృష్ణ, తోనంగి వెంకటరమణియాదవ్, దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

సింథియా : జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పశువుల ఆసుపత్రి వద్ద ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వేసవిలో వివిధ పనుల నిమిత్తం బయటికి వెళ్లే వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతుందన్నారు.

పశువుల ఆసుపత్రి పునర్నిర్మాణానికి కృషి

గాంధీగ్రామ్ పశువుల ఆసుపత్రిని సందర్శించిన ఆనంద్‌కుమార్ శిథిలావస్థకు చేరిన ఆసుపత్రి పునర్నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. షిప్‌యార్డ్ యాజమాన్యంతో మాట్లాడతానని, అవసరమైతే సొంత నిధులతో ఆసుపత్రి నిర్మాణ పనులు చేపడతానన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పశువుల డాక్టర్ సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, పుర్రి సురేష్, నమ్మి శ్రీను, ఆల్ఫా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నష్టపరిహారం అందజేత

సింథియా : ఈనెల 3న ప్రమాదవశాత్తు మృతి చెందిన దోగాన సూర్యనారాయణ కుటుంబానికి రూ. 19 లక్షల నష్టపరిహారాన్ని అందజేశారు. ఆయన విశాఖ నేవల్ షిప్ బిల్డింగ్ సెంటర్‌లోని నవయుగ ఇంజినీరింగ్ కంపెనీలో గత 14 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. ఈ నెల 3న యథావిధిగా విధులకు హాజరైన సూర్యనారాయణ బాడ్జిపై పని చేస్తూ జారి పడిపోవడంతో మృతి చెందారు. ఆయనకు భార్య యశోద, కూమారులు నవీన్, కిరణ్ ఉన్నారు. మరణ వార్త తెలుసుకున్న విశాఖ డిఫెన్స్ కాంట్రాక్ట్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, సీఐటీయూ నాయకులు సుబ్బారావు, కె.శేఖర్, పెంటారావు నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి మృతుని కుటుంబానికి రూ. 19 లక్షల నష్టపరిహారం అందించేందుకు అంగీకరింపజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో మూర్తి, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరిని క్షీరాభిషేక సేవకు అనుమతించనున్నట్టు చెప్పారు. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు



సహస్ర ఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. గత నెల 30న కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం అష్టోత్తర శత కలశస్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఘటాలలో నీటితో మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, ఆలయ ఈవో జీవీ రమాబాయ్ పాల్గొన్నారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

వైభవ వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేకంలో పాల్గొన్న భక్తులు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, అర్చకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలు, భక్తులు, అర్చకులు మంగళధ్వనితో వేద మాంత్రోచ్ఛారణల మధ్య ఆలయ అభిషేక ప్రదక్షిణ చేశారు. అనంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో స్వామికి అభిషేకం చేశారు. ఉదయం 8.30 గంటలకు స్వామి నిజపాద దర్శనం, 10.30 గంటలకు అలంకార దర్శనం భక్తులకు కల్పించారు. అనంతరం అర్చన చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలకు శాలువా, కండువా, బ్లౌజ్, వైభవుడి చిత్రపటాన్ని అందజేశారు. మంగళశాసనాలు, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు.

వాక్ ఇన్ డ్రైవ్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్



ఇంటర్వ్యూలకు హాజరైన యువత

సీతంపేట: శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 25వ వార్డు గణేష్ నగర్‌లోని ఎస్‌కేవైఎస్ఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మెగా వాక్ ఇన్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ దేశంలో ఉపాధి అవకాశాలకు కొదవ లేదని, వాటిని అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పెంపొందించుకోవాలన్నారు. కార్పొరేట్ ఉద్యోగాల సాధనలో కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కీలకంగా మారాయని, ఆ దిశగా యువత కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధితోపాటు, యువతకు ఉపాధి కల్పించేలా జాబ్ డ్రైవ్ నిర్వహించిన శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులను ఆయన అభినందించారు. అనంతరం బీపీవో, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రికల్ రంగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బోర ఈశ్వరరావు, బోర రమణ, సారిపిల్లి గంగరాజు, సానబోయిన సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం



కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం, క్రీస్తు రక్షకుని యాత్రా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఫాదర్ సరసా ప్రతాప్ పతాకావిష్కరణ చేశారు. జపమాల, దివ్య బలి పూజలు నిర్వహించారు. అనంతరం నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. స్వస్థత ప్రార్థన కూటమి ప్రార్థనలు చేశారు. పుర:ప్రదక్షిణ, బైబిల్ పదకేళి పోటీలు నిర్వహించారు. 9 రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు మే 14న బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి ఆల్బర్ట్, పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) సభ్యులు ఆమర్, ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బేతా రాణిజోసెఫ్, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామిని దర్శించుకున్న జియ్యాని



సత్యనారాయణ స్వామి సన్నిధిలో జియ్యాని శ్రీధర్ దంపతులు

గోపాలపట్నం: ఇసుకతోట సత్యనారాయణ స్వామిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు పలికారు. స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.